# రెడ్డి రంగమ్మ

ఆయేడు చేలు విపరీతంగా పండటంచేత వీరారెడ్డికి మూడువేలమితంగా లాభమొచ్చింది. ఇంటిల్లిపాదీ సంతోషంతో అమ్మవారికి ఉత్సవాలు జరిపారు. వీరారెడ్డి మజూరికి మాత్రమే యాభై రూపాయలిచ్చి, చెన్నపట్నం కొత్తరకంది అడ్డిగ చేయించాడు తన భార్య రంగమ్మకి. చెల్లెలు జానకమ్మకి పట్టంచుచీరె పెట్టాడు. పాడికి యెర్రమచ్చల ఆవుని కొని మందలో చేర్చాడు. ప్రతి మాఘమాసంలోనూ తిరనాళ్ళకు నెల్లూరు వెళ్ళడం మామూలు వీరారెడ్డికి. యీయేడు రంగమ్మనికూడా రమ్మన్నాడు. యిదివరకూ చాలాసార్లు అడిగాడు కానీ అతనితల్లీ రంగమ్మా యిద్దరి దగ్గిర్నించీ వొచ్చాయి అభ్యంతరాలు. పల్లెకదిలి ఆడకూతురు బస్తీకి పోవడమంటే యేదో భయమూ, కొత్తదనమూ, అమర్యాదా. తాను పుట్టిన వూరు, అత్తగారి వూరు, మధ్యవున్న రెండు చిన్న పల్లెలూ, యీ నాలుగే రంగమ్మ భూగోళం. పట్టణాల్లో జరిగే దొంగతనాలూ, నాటకాలూ, వితంతు వివాహాలూ, ఎలెక్షన్‌లూ, మోసాలూ, మోటార్లూ, తాగుళ్ళూ, బయస్కోపులూ, సోడాలు అన్నీ వినికిడిగా తెలియవొస్తోవుంటాయి ఆ వూరుకి.

భార్యాభర్తా పదిమైళ్ళు నడిచి, మోటారు బస్సుకోసం రోడ్డు పక్కన నుంచున్నారు. రెడ్డికీ ప్రయాణాలూ, అనుభవాలూ, మామూలే. కాని ముందేమి జరుగుతుందో, యేమి తమాషాలు చూస్తామో అనే ఆశతో, రంగమ్మ మనసు గంతులేస్తోంది. బొయ్యిమని వూత్తో, పెనురాక్షసుడివలె వెనక పొగలు రేపుకుంటో, వొచ్చి నిలిచింది మోటారు బస్సు. బండీ నిండి వుంది ఆడదని డ్రైవరు పక్కన కాళీచేసి, కూచోమన్నాడు. రంగమ్మ వీరారెడ్డివంక చూసింది రమ్మని. అతను యెక్కపోతుంటే-

"యెక్కడెక్కుతావు? వెనక్కి పో. నీ పెళ్ళాన్నెవరూ యెత్తుకెళ్ళరు."

అని పొగరుమోతుతనంగా అన్నాడు డబ్బులసంచీవాడు. రంగమ్మ నాళాల్లోని రెడ్డిరక్తం ఒక్కదూకు దూకింది. కొంచెం అమర్యాదగా గొంతెత్తితే ఒక్క గుద్దుతో యెద్దువంటి పాలెగాణ్ని కిందకూల్చేవీరారెడ్డి, మోటారువాణ్ని తన కళ్ళముందు చీల్చేశాడనుకుని వెనక్కి తిరిగింది ఆమె. యీమనకండా మూట బుజానేసుకుని తోకమడిచిన కుక్కవలే వెనక్కి వెడుతున్నాడు రెడ్డి. యెర్రమెరుపుతో నిండిన నల్ల మబ్బులవంటి చెంపలతో వెనక సూర్యులు ప్రకాశిస్తున్నారా అనిపించే కనుగుడ్ల తళుకులతో, మెడపైకెత్తి మొహంమీద జుట్టును పొడుగాటి వేళ్ళతో పైకిపట్టుకుని శత్రువుల మధ్య వీరవనితవలె నుంచుంది రంగమ్మ. తిరస్కార సుందరమైన ఆ దృశ్యం డ్రైవరు హృదయాన్ని దూసుకుపోయి-

"మొగుడులేంది యెక్కదటయ్యా-" అనే హేళనధ్వనిలో వ్యక్తమయింది.

"రావయ్యా, బాబూ, కూచో!"

అని చోటుచేసి యిద్దర్నీ కూచోపెట్టాడు డ్రైవరు. యెన్నడూలేనిది నలుగురిలో భర్తభుజానికి భుజాన్నానించాననే సిగ్గుతో, కలవరపడుతో కళ్ళువాల్చి, రెండుచేతుల్నీ తొడలమధ్య జోడించి కూచుంది. బుర్రుమని బండి కదిలింది. కాళ్ళకింద యేదో జరుగుతుంది. అదిరిపడి రంగమ్మ చూసింది. ఆ చప్పుడెక్కడ? యెట్లా కదిలింది? భర్తనడిగింది; మరలున్నాయన్నాడు. అంతకంటె అతనికేమీ తెలియదు. భర్తనించి ఆ డ్రైవరు చేసే పనులవేపు మనసు తిప్పింది. వేగమెక్కువవుతోంది. యేం చేస్తున్నాడు? అద్భుత శక్తులు కలిగిన ఇంద్రజాలికుడివలె కనపడ్డాడు ఆ మోటారు కుర్రవాడు...బండి.... బండి పెద్ద మోటబండి యెదుట; మోటారు సూటిగా దానిమీదికి వెడుతోంది. ఈ వేగంతో, ఒక్క క్షణంలో ఆ బండీమీద పడుతుంది. ఇంకేముంది? చప్పున డ్రైవరు బుజంమీద చెయ్యేసి,

"ఆ, ఆ, ఆపు, ఆపు" అని కేకేసింది.

అందరూ నవ్వారు. అందరికన్నా నవ్వాడు ఆ కుర్రాడు. సూటిగా పోయే మోటారుబండి తప్పుకుని పక్కగా వెళ్ళింది. యెట్లా తప్పించాడు? వెనక్కి తిరిగిచూసింది. దుమ్ములో దూరంగా బండీ కనపడుతోంది. రంగమ్మ మనసు ఆశ్చర్యమయమయింది. అందరూ నవ్వినందుకు సిగ్గుకలుగుతోంది. తను రెడ్డికుల ప్రధానుడు లక్ష్మారెడ్డి యింటి ఆడపడుచు. తన మాటలూ, నగలూ అందరికీ కావలసినవిషయం, తన నిష్కల్మష జీవితం అందరినించీ మర్యాదని పొందుతుందనేభావం అన్నీ మాయమైపోయినాయి. తనూ, తన భర్తా యిక్కడ యెవరికీ లక్ష్యం లేదు. యిద్దరి ప్రాణాలూ తన పక్కనున్న కుర్రవాడి చేతులో వున్నాయి....

.....మోటా రాగుతోంది. పెద్ద తలగుడ్డా, నల్లకోటు వేసుకుని ఒక మీసాలాయన అడ్డంగా నుంచున్నాడు.

"నా మామూలు స్తలమున్నదా?"

"లేవయ్యా, యింక దిగు" అన్నాడు మోటారువాడు వీరారెడ్డిని. అతను భయంతో దిగుతున్నాడు. తనూ దిగింది వెనకనే.

"ఏమమ్మోయ్. నీకు వెనక చోటులేదు. అక్కడే కూచో."

కదలలేదు రంగమ్మ. అందరికళ్లూ తన మీదవున్న జ్ఞానంతో తలొంచుకుని, సిగ్గుతో కుంగిపోతో, బొటనవేలితో భూదేవిని ప్రశ్నలడుగుతో నుంచుంది. నిమిషాలైపోతున్నాయి. మోటారు నిలిచింది.

"యెక్కు" అన్నాడు రెడ్డి. భర్త ఆజ్ఞానుబద్ధురాలయింది రంగమ్మ. రెడ్డి వెనక్కి వెళ్లాడు యెక్కడానికి.

"యీ పాడు మూటా, కఱ్ఱానూ, యెవడయ్యా నువ్వు!"

"యేదో జంతువు."

అందరూ నవ్వారు.

రంగమ్మ తల తిరిగింది. రక్త మాగింది. నుంచుని, వెనక్కు తిరిగి.

"ఎవడురా ఆ నాలుకకొవ్వి కూసేది? ఎవరనుకున్నావు? దవడపళ్లు రాల్తాయి. చూసుకో" అనాలనిపించింది.

తరతరాల్నించి యెవ్వడూ తమ మాటకెదురు సహించని రెడ్డి రాణుల రక్తం యెంత అణిచినా లొంగక తిరగబడింది. భర్తవంకచూసి న్యూనతనైనా గుర్తించని అతని నిర్లక్ష్యానికి కుంగిపోయి, కౌరవుల జూదపుసభలో ద్రౌపదివలె సిగ్గుతో కోపంతో తలవాల్చుకుంది. మోటారు సాగింది. ప్రపంచం దుఃఖ్ఖమయమయింది రంగమ్మకి. గారాబంగా పెంచుకునే తరిపి దూడని, అమాంతం క్రూరమృగాలతో నిండిన మహారణ్యాలంలోకి తోలినట్లుంది. కళ్ళు తెరవడమంటే భయమేసింది.

ఎంత సేపయిందో, మోటారాగినప్పుడు నెల్లూరు వొచ్చిందనే ఆశతో కళ్ళు తెరిచింది. కాదు, విశ్రాంతికై మనుషులు దిగుతున్నారు. తనూ దిగుతో వుంటే చెరుగు మేకుకి పట్టుకుని చిరిగింది. పక్కనున్నవాడు తప్పించి చిన్నగా నవ్వాడు. కిందికి దూకింది. ఇంకోడు నవ్వాడు. కోపంతో వెనక్కి తిరిగి చూసింది. ఇంక నలుగురూ నవ్వినట్లయింది. సిగ్గుతో, కోపంతో, కాళ్ళు వొణికి కదలలేకపోయింది. జ్వరపు కలలో అర్థంలేని మాయలోకంలో పడే అంతంలేని శ్రమలాగుంది ఆమె గతి. అందరూ వికృతంగా తనవంక చూస్తున్నట్టే, తనని వెక్కిరిస్తున్నట్టే తనని హీనత చేస్తున్నట్టే! పురుషశ్వాస నెరగని గోషాలలో నివసించిన పూర్వవంశ స్త్రీల ముగ్ధత్వం, యితరుల పరియాచకాన్నైనా భరించని సౌశీల్యం, గాఢంగా గాయమైనాయి. తొరగా నడిచి చింతచెట్టు చాటుకి వెళ్ళింది. వెనకనే మూటా, కఱ్ఱా, వీరారెడ్డీ వొచ్చారు. ఎఱ్రజీరలున్న పెద్దకళ్ళతో గాలికి మొహంమీద యెగుర్తున్న జుట్టు పైకి తోసిపట్టుకుని, తన పళ్ళ నొక్కులతో, యెఱ్రపడ్డ పెదిమ వొణుకుతో, అతనిముందు నుంచుని, యెన్నడూ లేని దీనత్వాన్ని తోపిస్తో-

"ఇంటికెడదాము" అంది. అధైర్యంతో హీనమైన స్వరం వినపడేట్టు. వీరారెడ్డి మామూలుగానే కనబడ్డాడు. అది మరింత ఆశ్చర్యం రాణి రంగమ్మకి. ఎన్నిసార్లో ప్రయాణాలు చేసిన అతను యిట్లాంటి 'సీను'లెన్ని చూశాడో!

"ఎందుకు?"

"నాకు బావుండలేదు-"

"నెల్లూర్లో బావుంటుంది."

"వొద్దు!"

"ఎట్లా వెడతా విప్పుడు?"

"నడిచి."

"నలభై మైళ్ళు!"

"సరే"

"రాత్రవుతుంది"

"పోనీ."

"దొంగలు"

"భయంలేదు"

"అంతకాడికి యెందుకొచ్చావు? కారణం లేకుండా వెనక్కి పోదామంటావు, ఈ ఆడవాళ్ళని తీసుకొస్తే యిదే తంటా!"

వీరారెడ్డి చాలా విసురుగా మాట్లాడాడు. యామన్నా వొదులుకుంటాడు గాని తిరణాలు మానలేడు రెడ్డి. యాడాదీ కష్టపడ్డదానికి ఫలితం అవొక్కరాత్రే అతనికి. భర్త మనసు కష్టపడ్డట్టు అనిపించగానే, రంగమ్మ తన స్వభయాలనీ, బాధల్నీ అణగతొక్కి, మాట్లాడకుండా తల తిప్పేసి అంగీకారాన్ని సూచించింది. భరించలేనిదాన్ని కూడా కర్మమనో, ధర్మమనో సంతుష్టిచెంది, నోరెత్తక శాంతంగా అనుభవించడం తరతరాలనించి అలవాటు.

మోటారు సాగింది. ఆమె లేత హృదయం యెంతకాలం ముడుచుకుంటుంది? ఆ చలికాలపు యెండలో, రంగుమబ్బుల్లో నీలపాకాశం కింద, పచ్చని చేలమధ్య, చెట్లూ, పిట్టలూ, గడ్డీ, తన ఇంటివేపు పరిగెత్తుతున్నాయి. మోటారుకింద రోడ్డు గిరగిర తిరిగిపోతోంది. చల్లని గాలి చెంపలనించి, పమిటలోనించి రాసుకుంటో పోతోంది. ఆమె కష్టభావానికణగక, రంగమ్మ మనసొక్క గంతువేసింది. రెండు పెద్దకళ్ళూ తెరిచి, జుట్టునీ, కుచ్చెళ్ళనీ, యెగరకుండా రెండు చేతులతో పట్టుకుని నవ్వు పెదిమలతో చుట్టూ చూస్తోంది. మోటారు వూదడం, మనుషులు మూటలతో కావిళ్ళతో పక్కకి పరిగెత్తడం, వంతెనలు, రోడ్లమలుపులు అన్నీ ఆమెదృష్టినాకర్షించాయి. ఆమె డ్రైవరుకుర్రాడి దృష్టి నాకర్షించింది.

"యేవూరు? రెడ్లా?" అని అతనూ.

"మళ్ళీ మోగించు, యెక్కడ మోగుతుంది?" అని ఆమె.

ఆ మాట అడగడంతో చనువయింది. అతనికి కులాసా పుట్టింది.

"తొరగా పోనీనా?"

"ఏం చేస్తే పోతుంది బండి?"

"మంత్రం"

"అబద్దం"

"మెల్లిగా పోనీనా?.... కాలవలో పడుతున్నావు...బండీ...పడేస్తా...యిదివరకెప్పుడూ యెక్కలా!" అని అతనూ.

"ఏదీ ఆ బండి కనపడకుండా పోనీ. యింకా కపడుతోందిలే..... యింకా, యింకా తొరగా, చాలు, చాలు"

"భయమే?"

"ఆ. చాలు. దీంటో యేం పోస్తారు? నిప్పా? ఆ వాసనేమిటి?ఆ.... ఆబద్దం నూనెపోస్తే నడుస్తుందా యేం? నీకెట్లా చాతయింది? రైలు కూడా నపడగలవా? తొక్కుడు బండెక్కగలవా? నీ కేమిస్తారు? నువ్వు గొప్పా? ప్లీడరు గొప్పా?"

చుట్టూవున్న వాళ్ళందర్నీ మరిచి చిన్నప్పటి బిళ్ళ ఆటలు ఆడేటప్పటి స్నేహితులతో వలెనే, ఆ కుర్రవాడితో సరదాగా మాట్లాడింది. ఇట్లా తన హెూదా మరిచి కొత్త మనిషితో ముచ్చట లాడతావని యెవరన్నా ముందటిరోజున అంటే నమ్మివుండేదికాదు. ఇంటికి వెళ్ళింది తరవాత తనేనా ఇట్లా పరాయివాడితో మాట్లాడింది అని ఆశ్చర్య పడుతుంది. ఆ సరదాలో వెనకనించి బుజంమీద రెండు వేళ్ళవరోవేసింది, తెలీదు. ఆ హృదయంలో తనమాటలు, నవ్వు. జుట్టుముడి కలగచేసిన అందోళాన్నెరగదు. నెల్లూరులో ప్రవేశించగానే యెదురుగా రివ్వున వొచ్చే మోటారునీ, దానిలోవున్న అందమైన దంపతుల్ని చూసినప్పుడు కళ్ళెత్తింది. మేడలూ, బంగళాలూ, ముందున్న పువ్వుల తోటలూ, నున్నటిరోడ్లు, దూకాణాలూ, ఆడవాళ్ళు కట్టుకున్న చీరెలూ, ఆ జుట్లు షోకులూ, యెన్నో చూడాలి, యెన్నో అడగాలి. ఆమెకళ్ళు యిటూఅటూ ఆశ్చర్యంతో ఆనందంతో దూకులాడాయి.

## 2

మోటారాగింది. వీరారెడ్డి పక్కకివొచ్చి దిగమంటే అతను తనతో రానట్టూ అప్పుడే ఆకస్మాత్తుగా నెల్లూరులో తనకి కనపడ్డట్టూ ఆశ్చర్యంతో కళ్ళుతెరిచి చూసింది.

"రా."

డ్రైవరువొంకా భర్తవొంకా చూసింది. అతని క్రాపూ, గ్లాస్కోచొక్కా, నాజుకైన వొళ్ళూ, చిన్న మీసమూ, దిగి మర సద్దుతున్న అతని నేర్పూ-యితని పీచురేగిన జుట్టూ, ముతకబట్టలూ, నోరు తెరుచుకుని భయంతో చూసే పొరలుకమ్మినకళ్ళూ, యీ పట్టణంలో యీ అద్భుతాల్లోచేరి సహజంగా స్థయిర్యంగా నిర్లక్ష్యంగా తిరిగే వాడా డ్రైవరు. తన భర్తకి నాగలిపట్టడం తప్ప యేమీ చాతకాదు. అతని మోటుతనమూ, వ్యర్థత్వమూ, అసహాయత్వమూ వ్యక్తమైనాయి ఆమెకి. మోటా రామెభర్త చేతికిస్తే!....

ఒక్క నిట్టూర్పు విడిచి, దిగి వీరారెడ్డి వెకన బైలుదేరింది.

యేంబళ్ళు, యేంగోల, యేంబజార్లు, యేంచీరెలు, శాలువలు, బొమ్మలు, ఆ మనుషు లెంత అందంగా వున్నారు. ప్రతిమనిషీ, షాపువాడూ, ఫకీరు, పోలీసువాడూ, బండివాడూ అందరూ గొప్ప వారే! శుభ్రంగా నాజూకుగా ఇంగ్లీషు, తురకం, అరవం మాట్లాడుతో తెలివిగావున్నారు. ప్రతివారూ తనకన్న తన భర్తకన్న గొప్పవారే. ఆనంద వంతులే. విచారమూ బీదతనమూ లేని స్వర్గానికి వొచ్చినట్లుంది. బాండు వాయిద్యం వెనక. మోటారెక్కి, కళ్ళు మిరుమిట్లు గొలిపే చీరెలు కట్టుకొని వూరేగింపు వస్తోంది.

"మన నీవూళ్ళో వుణ్ణిస్తారా?"

"వుణ్ణియ్య కేం?"

"యెప్పుడూ?"

"యెట్లావుంటాం?"

"యేం?"

"మనవాళ్ళూ, పొలమూ?"

"వుండాలనుకుంటే వుణ్ణిస్తారా?"

"పిచ్చిదానా, యెందుకు వుణ్ణియ్యరు. యింతమంది మనుషులుండగా!"

"యిక్కడే వుందాం"

యీ దీపాలలో యీ అంగళ్ళమధ్య వూరికే గుమ్మంలో కూచుని వీధికేసి చూస్తోవుంటే చాలదూ? వుందామనే మాటతోనే ఆమె మనస్సు సంతోషంతో వూగింది.

"యిక్కడా? ఎట్లా? జీవనమో!"

"అక్కడ మల్లేనే."

"పొలా లెవరు చూస్తారు?"

"వీళ్ళందరునో?"

"వాళ్ళు వాళ్ళ పనులు చేసుకుని సంపాయించుకుంటారు."

"మీరు?"

"నాకేం చాతనౌతుంది?"

అవును, యేమీ చేతకాదు, ఆ పాడు వ్యవసాయం తప్ప. రంగమ్మ మనసులో ఒక అభిప్రాయం నాటుకోడం ప్రారంభించింది. యెవర్ని తన దైవమనీ, ధైర్యవంతుడనీ, పురుషశ్రేష్ఠుడనీ, తనూ, తనపల్లెలోని మనుషులందరూ గౌరవిస్తారో, నౌకర్లందరూ భయంతో

చూస్తారో, ఆ వీరారెడ్డి, యీ వూళ్ళో ఈ గుంపుల్లో, యీ రోడ్లమీద, మోటార్లమధ్య యెందుకూ కొరగానివాడూ, నిస్సహాయుడూ, అనామకుడైనాడు. నిశ్చలంగా, నిర్భయంగా, మోటార్లపక్కన అందరూ నడుస్తోవుంటే, తన దైవం తన కొంగుపట్టుకుని పది గజాలదూరం పరిగెత్తడం చూసింది. గజం రూపాయి చెప్పిన పట్టుబట్ట, యితను నాలుగణాలకడిగితే, యెన్నడన్నా పట్టుబట్ట చూసిన మొహమేనా అని, రెడ్డికుల సార్వభౌముణ్ని, తృణీకారంగా, పొమ్మనడం చూసింది. కాఫీహోటల్లో అందరూ కుర్చీలమీద కూచుంటే, తన ప్రాణనాయకుణ్ని ఒకమూల కూచోపెట్టి ఫలహారం పెట్టడం గమనించింది. ఈ వ్యక్తిని పెళ్ళిలో అందల మెక్కించి, తనవాళ్లూ, వూరివాళ్ళూ అతని గుణాల్ని పొగిడి, తనని మోసం చేసినట్లుగా 'ఫీ'లయింది రంగమ్మ. ఆ నిమిషాన వీరారెడ్డి నలభై అంగుళాల ఛాతీ, బలిసిన కంఠమూ, పచ్చగావున్న, సూనృత మొలికే కళ్ళూ, పైకి మర్యాద కనపరచకపోయినా హృదయంలోని స్త్రీగౌవరమూ, ఆ వూళ్ళో వాళ్ళ నెవళ్ళనైనాసరే పదిమందిని కొట్టగల సామర్థ్యమూ, జంతువులయెడ దయా, బంధుప్రేమా, నీచత్వాన్నెరగని శీలమూ, అన్నీ కనపడలేదు రంగమ్మకి. సన్నగా, దగ్గుతో, పట్టుకండువా చెయ్యిమీదనించి జార్చి, సిగరెట్టు తాగుతో, తాంబూల మేసుకుని కులుకుతో, తనవంక వోరగాచూసే నాయుడి భార్య యెంత అదృష్టవంతురాలా అనుకుంది.

రంగమ్మకి తన పాతవ్యక్తిత్వం చప్పున నశించింది. తన వూళ్ళో పెద్దవారు తనపైని చూపే వాత్సల్యమూ, పిన్నలుచూపే భక్తీ, మొత్తానికి తను అందరికీ కావలసి రావడమూ వాటి భావమే నశించింది. ఇక్కడ తనెవరో ఎవరికీ తెలీదు. తన సంబంధాలూ, తన సుగుణాలూ, తన అత్తమామలమీద భక్తీ, వ్రతాలపైని శ్రద్ధా, బ్రాహ్మణ పూజా, తనకి రెండువందల యెకరాల పొలమున్న సంగతీ యెవరికీ తెలీదు; యెవరికీ అఖ్కర్లేదు. కాని తన శరీర సౌందర్యం కళ్ళ నాకర్షించడం, దాని వల్లనే అందరూ తనకి కొంచెం ప్రాముఖ్య మివ్వడమూ కని పెట్టింది. స్త్రీకి సహజమైన ఆసక్తి, తన సౌందర్య ప్రతిభాలాభాన్ని పొందాలనే కోర్కె ఆమెలో మొదటిసారి మేల్కొంది. ఒకటి రెండుసార్లు చూపులకు చూపులిచ్చింది. రెండు మూడు చిరునవ్వులతో, నాలుగైదు హృదయాల్ని మండించింది. ఈ నూతనశక్తి భావంతో ఆమె కొక నూతనానందం జనించింది. ఆ పట్టణ నూతనత్వమూ, సౌందర్యమూ, తాగిన కాఫీ, పువ్వులవాసనా, సన్నాయి మేళమూ, ఆమె వుత్సాహాన్నీ, రసికత్వాన్నీ, బతికి వుండడమే ఆనందమయమయ్యే స్థితిని రేపాయి. నవ్వుతున్న పెదిమలతో, వూగుతున్న నడుముతో, పొంగుతున్న వక్షంతో, యెండలో గాలిలో నేవళంగా పెరిగిన మెరుపుతో నడుస్తోంది ఆ భర్త వెనక, గౌతముడి వెనక నడిచే అహల్యలాగు.

## 3

చప్పున దీపాలు వెలిగాయి. ఇంపీరియల్ బయస్కోపు మొదటి ఆట అయిపోయింది. రెండు గంటలసేపు తదేకదీక్షగా, కథానాయికతో ఐక్యమై, ఆమె అదృష్ట దురదృష్టాలని

తనవిగా భావించి, సుఖదుఖ్ఖాలకి లోనవుతున్న రంగమ్మ కళ్ళునులుముకుంటో, పెద్దనిట్టూర్పు విడిచింది. మొదట్లో ఆ దీపాలెట్లా వెలుగుతున్నాయా అనీ, బొమ్మలెట్లా వొస్తున్నాయా అనీ, ఆశ్చర్యపడ్డా, తొరలోనే కథాసక్తిలో మైమరిచింది. బొమ్మల్లో కనపడే సౌధాలూ, కాలవలూ, ఉద్యానవనాలూ, మోటార్లూ, రైళ్ళూ, అందమైన ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ అన్నీ చూసి ఆ లోకానికి వెళ్ళింది. అదంతా కూడా నెల్లూరులో భాగంగానేవుంది రంగమ్మ మనసులో. ఆ కథానాయకి బాధపడ్డప్పుడల్లా మూల్గింది. ఒకసారి దొంగ లామెని పట్టుకోపోతోవుంటే, "కత్తిలాక్కో, పోడు" అని అరిచింది. ధీరుడు వొచ్చి అద్భుతకార్యాలు చేసినప్పుడల్లా రంగమ్మ తన హృదయాన్నతనికి దత్తం చేసింది. కథానాయకితనే అనుకుంది. పర్యవసానంలో అతను కథానాయకిని కావలించుకున్నప్పుడు రంగమ్మ వొళ్ళు పులకరించింది. తనని కావలించుకున్నట్టే సంతోషించింది. అంతా ఐపోయినా యింకా యేది జరుగుతుందోనని కూచుని వుంది, అందరూ వెడుతున్నా. వీరారెడ్డి వొచ్చి రమ్మంటే. తనకీ అతనికీ ఏమీ సంబంధంలేనట్టు చూసింది. తరవాత, కొంచెం జ్ఞాపకం రాగా-

"వెళ్ళాలా! అయిపోయిందా!" అంది తన సుందర స్వప్నాన్ని విచ్చినంచేసి, గంధర్వలోకంలో దాన్ని, తనని కిందికీడ్చి, తన అప్రమేయానందాన్ని ధ్వంసంచేసిన మహాపాతకిలా కనపడ్డాడు అతను. పెద్దటుపాకీలనికాల్చి, మంటలలో దూకి, మోటార్లనించి యెగిరి, రైళ్ళాపి, శత్రుసంహారంచేసి లోకోద్ధరణ మొనర్చిన మహా యోధులందర్నీ వొదిలి, యీ పల్లెటూరి మొద్దు రెడ్డివెనక. నడవాలా? తనకి కనపడకుండా యెక్కడన్నా తప్పిపోనన్నా పోయినాడు కాదు! కాళ్ళీడ్చుకుంటో లేచింది.

"ఎక్కడికి?"

"బైటికి"

"తరవాత?"

"నాటకానికి"

"నాటకమా?"

## 4

రాత్రి వొంటిగంటయింది. నాటకం పాకనించి భర్తా రంగమ్మా నడిచిపోతున్నారు. ఆ రోజు అయిపోయింది. ఇరవైయేళ్ళకి తనికి లభించిన ఒక్కదినమూ అంతమయింది. మళ్ళీ యింకెన్నాళ్ళకో, యీ దీపాలూ యీ రోడ్లూ, యీ అత్తరువాసనలూ, యీ బాండూ - యెన్నాళ్ళకో! ఏ అరుగుమీదో యీ చలిలో ముడుచుకుపడుకోడమూ, తెల్లవారగానే లేచి మోటారెక్కి వూరికిపోవడమూ, మళ్ళీ పాలు పితకడమూ వెన్న తియ్యడమూ, వంటా, పశువులదాణా, యీ ఎక్సైట్మెంటుని, యీ నాటకాల్నీ వొదిలి, నాటకంలోని కృష్ణుణ్ణి వొదిలి!- ఆ విగ్రహమూ, ఆ ఠీవి, ఆ చాతుర్యమూ, ప్రణయదృష్టులూ, సంగీత

మాధుర్యమూ, అన్నీ జ్ఞాపకం వొచ్చి గుండె బరువెక్కింది. నడవలేక కాళ్ళు తొట్రుపడ్డాయి. చిన్నప్పణ్ణించి రంగమ్మకి కృష్ణుడు యిష్టదైవం, ఆ దేవుడితోయెన్నో ఆటలాడుకుంది. చిన్నప్పుడు ఆయన్ని తన భర్త అనుకుంది, సిగ్గులుపడ్డది. రహస్యంగా పడుకుని మాటలెన్నో మాట్లాడింది. అతనిపైన కలలనేకం కన్నది. భాగోతంలో పద్యాలూ, క్షేత్రయపదాలూ నేర్చుకుంది. తన బాధలూ, భావాలూ అన్నీ నివేదించుకుంది. ఈనాటి కతడు సాక్షాత్కరించాడు. ఈ నాటకంలోని వేషధారి లక్షణాలూ, తన ఆశయపు కృష్ణుడిగుణాలూ ఏకమయినాయి ఆమె మనసులో. తన మనోనాథుడు మానధనచోరుడీ కృష్ణుడే. భర్త రాత్రులు తన దగ్గిర చేరినప్పుడు అప్పుడప్పుడు కళ్ళు మూసుకుని అతను కృష్ణుడే అని మోసగించుకుని తృప్తిపడుతుంది. రసికులలో రసికుడు, వీరాధివీరుడు. అతని కళ్ళలోని దయ, సత్యభామయందలి విధేయత, ఉన్నత సౌమ్యప్రణయము, ఆ మాటల నేర్పరితనం, చూపులనాజూకు, ఆ దొంగ నవ్వులు ఆ వాత్సల్యం, అతనితో వుండగలిగితే! అందరు స్త్రీలతో తానొకతె, తన్నునిరాకరిస్తాడా? కరుణాకరుడు, వాత్సల్యజలధి ప్రేమనిధి! గోపీలోచన చాతకాంభుదమణి! తన సౌందర్యం యితరుల నాకర్షించిన జ్ఞాపకం స్ఫురించింది. తననిచూడగానే, కృష్ణుడి కళ్ళల్లో మమత కనపడదా? ఆ చీకిరికళ్ళ కొంగమెడ సత్యభామనే అంతకోర్కెతో చూసి, అంత బతిమాలి, తిట్లు భరించాడే! తన సౌందర్యాన్ని మోహించడా? ఈ కృష్ణుడు వేషమనే విషయం తెలుసుకాని, తెలుసుకోడం యిష్టంలేదు. ఆ మాయ విడిపోతే, యీ మాధుర్యం యీ ప్రమత్తత విచ్చిపోతుంది. కృష్ణుడే, తను చూసింది. కృష్ణుడు-నమస్కరించిది. ఎన్నో భావాలు కల్పించుతుంది. తనవంకనే చూసి చదివాడు తనని గురించేపాడాడు. తన కోసమే ఆ చివరకి వొచ్చి నుంచున్నాడు. తనవైపే ఆ చిరునవ్వు. తన భక్తురాలిని, దాసురాలిని ఆ స్త్రీ సమూహంలో గుర్తించాడు.

"శిష్టజనులను బ్రోచె, దుష్టుల ఖండించె"

అనే పద్యం నోట్లో ఆడింది రంగమ్మకి. తనని పిలుస్తున్నాడు; తనకి కూడా స్థలముంది, ఆ గోపికా వల్లభుడి హృదయంలో..... అదుగో దూరంగా, సలలిత మురళీనాదమే యది. సందేహమేలా! వెడితే? వెడితేనేం? యీ లోకంలో తన పల్లెటూరి ప్రజలతో తనకేం సంబంధం? తన కృష్ణు డిక్కడవుండగా ఆయన పాదపద్మాలలో తన హృదయాన్ని వొదిలి యెట్లా ఆ పల్లెటూరు పోవడం? తాత్కాలికంగా ఆమెని మీరాబాయి ఆవహించింది.

రంగమ్మ యోచనలన్నీ ఆ రోజున తారుమారైన్నాయి; ప్రపంచాలే మారిపోయినాయి ఆమె మనోకాశంలో. ఆమె పూజించే పద్ధతులు వ్యక్తులు, ఒక్కసారి కూలిపోయినారు. ఆమె పురాతనాహంభావం అడుగంటింది. నూతనానంద వాతావరణ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇదివరకు తానెరగని సుఖాలూ, ఆనందాలూ, అద్భుతాలూ, దృష్టిపథాన వికసించాయి. తాను చూసి కూడా అనుభవింపలేని, కొంచెంగా తోచి మాయమయే గూఢ దూర ఆకర్షణలు ఆమెని తొందరచేశాయి. "నీవు మాదానివి. వొదలకు వెళ్ళకు, యీ

కాంతిలోంచి, యీ ఆనందంలోంచి, యీ నూతన వికాసత్వంలోంచి, అంధకారంలోకి, మామూలులోకి, మృత్యువులోకి పడకు, వెళ్ళకు" అంటున్నాయి తన చుట్టునున్న పట్టణ పరిస్తితులు. చిన్నగూట్లో యింతకాలమూ రెక్కలు ముడుచుకుని కూచున్న రంగమ్మ ఆత్మ ఒక్కసారిగా రెక్కలు విచ్చుకుని విశాలాకాశంలో యెగర చూసింది.

ఆ నవీనావేశమంతా యీ రాత్రి కృష్ణుడిలో మూర్తీభవించింది. యీ వుత్సాహమూ, రసనా, ఉద్రేకమూ కృష్ణుడి లావణ్యామృతం వల్లనే కలిగాయి. కృష్ణుడే యిన్నిరూపాలతో తన హృదయపద్మం మీద నాట్యం చేస్తున్నాడు. అదుగో పిలుస్తున్నాడు. "సలలిత మురళీనాదమే యది." అదుగో వినవొస్తోంది సమీపంగా! వెళ్ళిపోతే? సందేహమేల? వెడితేనేం? యీ తుచ్ఛలోకంతో, వడ్లదంపుతో, పాడితో, తనకేం పని? తనెవరు, యీ భర్త ఎవరు? కృష్ణుడు. పరమాత్ముడు, సకల భక్తవత్సలుడు. అతనికంటే పరమాప్తు లెవరు? వెళ్ళాలి. యెన్నైనాసరే వెళ్ళాలి యెక్కడికి. నాటకమప్పుడు, కృష్ణుడు రంగ స్తలానలేని సమయాన. యెవరున్నా లక్ష్యంచెయ్యక అతనియందే మనసు లగ్నంచేసి, అతన్నే వెతుకుతో సైడ్‌కర్టన్ల వెనక కళ్ళు పెట్టుకుని కూచుంది. ఇందాక లోపల యేంచేస్తున్నాడు? లోపల యెంత బావుంటుందో? "అలవై కుంతపురంబులో నగరిలో ఆమూల సౌధంబులోపల మందార వనాంత రామృతసరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోది" అని చిన్నప్పుడు అర్ధంతో సహా చదువుకున్న పద్యం స్ఫురణకి వొచ్చింది. ఆ లోపల, పర్యంక రమావినోది, తనే! తనతోనే, లోపల, ఆ తెరలవెనక, గదులు, అద్దాలు, కుర్చీలు, వాటిమధ్య దాసీజనము కొలుస్తోవుండగా, పర్యంకంమీద, కృష్ణుడి పక్కన వొళ్ళు పులకరించింది.... అవును, అక్కడికి వెళ్ళిపోవొచ్చు. కృష్ణుడి నిలయమే అది. నగరిలో ఆమూల సౌధంబులో! వెళ్లాలి. అంత అప్రమేయానందముందు సందేహించడం నీచం. ప్రాణాలకి తెగించే సాహసాని కలవాటుపడ్డ పూర్వుల రక్తం ఆమె నాళాల్లో విజృంభించింది.

"కృష్ణుడు నీకోసమే యమునా సైకతాతలాల విరహిణీగీతాలు పాడుతున్నాడు. వెళ్ళు. మళ్ళీ ఆ పాత గోడలమధ్య వంటకట్టెల్లో పాతుకోకు" అంటోంది హృదయం. కాని తలొంచుకుని ముందునడిచే ఆ భర్తనేమిటి చెయ్యడం? ఈ సంగుతలేవీ అర్థంకావే అతనికి? యేమిటా వాయిద్యం? వేణునాదమా? నుంచుంది. వీరారెడ్డి వెనక్కి తిరిగిచూశాడు పిలిచాడు. ఆమె పలకలేదు. చప్పున అతను పెద్ద కేకేశాడు. దోవనపోయే వాళ్ళందరు ఆగి చూశారు.

"నీ పట్టెడేదీ?"

రంగమ్మ మెల్లిగా కళ్ళు పైకెత్తింది.

"నీ పట్టెడ!"

"పట్టెడ! పట్టెడంటే? పట్టెడేమిటి?

యెందకీగోల చెవికింద? స్వప్నాలతో తూగుతున్న కళ్ళతో, ప్రశ్న పూర్వకంగా చూసింది.

"అట్లా చూస్తావేమిటి? నీ పట్టెడ పోయింది"

పోయిందా? యింతేకదా? పోతేనేం? ఇంత గోలేమిటి? యీ వుత్సవంలో. యీ చల్లనిరాత్రి, యీ వేణుగానంలో, యీ రథంముందు, యీ బాణసంచావేళ పట్టెడ, ఆ పాడుపట్టెడేమైతేనేం?

"మాట్లాడవేం? పట్టెడేదీ?"

"లేదా!"

వీరారెడ్డి కాశ్చర్యం వేసింది.

"మెల్లిగా లేదా అంటావేం లేదు."

"పడిపోయిందేమో!"

"ఐదువందలరూపాయల పట్టెడ! యెక్కడిపోయింది?"

"యేమో!"

"యేమో! వొళ్ళు తెలీటంలా? రా, పోదాం. దౌర్భాగ్యురాలా!పద"

రంగమ్మ వినటంలేదు. వెనక్కి తిరిగి అతనితో వేగంగా నడుస్తోంది, కలలోవలె. యిళ్ళూ, బళ్ళూ, మనుషులూ, దీపాలు, సుడిగాలలోవలె కొట్టుకుపోతున్నాయి ఆ వసంతోత్సవ ప్రవాహంలో. ఆమెచుట్టూ కాళ్ళు భూమిని తాకక, యేదో తెలియరాని దానికోసం, అనంత, ఆదృశ్య అనిర్వచనీయ ఆదర్శ అనుభవంకోసం తనతో పెనుగులాడే హృదయమొక్కటే వాస్తవంగా తోస్తో వెళ్ళింది. నాటకం పాక పక్కకి వెళ్ళాడు. దీపాలన్నీ ఆరివుండడంచేత రంగమ్మ గుర్తించలేదు.

"యిక్కడనుంచో; చూసివొస్తాను."

పట్టెడట! పిచ్చి!

## 5

"యెవరికోసం?"

మెల్లిగా తిరిగి చూసింది. యెవరో మాట్లాడిస్తున్నారు. నాటకం పాక దగ్గిర వుంది తను. ఆ లోపలే తన కృష్ణుడున్నది. తనక్కడే నుంచుని వుంది. బైటికోస్తే వొకవేళ కృష్ణుడు! తన నీ చీకట్లో చూస్తే! గుండెలు కొట్టుకున్నాయి.

"యెవరికోసం?" అంటున్నారు యెవరో!

నిశ్చయించుకుంది. తన నిశ్చయాన్ని చూసి తనకే భయమేసింది

"కృష్ణుడికోసం."

"కృష్ణుడు! యే కృష్ణుడు!"

యెంత మూర్ఖం! యేకృష్ణుడుట! యే కృష్ణుడేమిటి. ఆలోచించింది. అతనిపేరు కృష్ణుడు కాదేమో!

"యిందాక కృష్ణుడు వేషం వెయ్యాలా?"

వేషం అనడం తనకే అభిమానంగా వుంది.

"నారాయణా?"

వూరుకుంది.

"యెరుగుదువా?"

తనెరక్కపోవడమేమిటి?

"యిట్లారా"

"కాళ్లు వొణికాయి. నిజంగా దర్శనమౌతుందా? నిజమే? యిప్పుడే?

"యిక్కడ వుండు." అని గుమ్మంలో నుంచోపెట్టి లోపలికి వెళ్ళాడు. చుట్టూ చూసింది రంగమ్మ. చీకటి. తాళ్ళు, దుమ్ము, ఇట్లా వుందేం! కృష్ణుడుండేచోటు యిదా? కాదు. యిక్కడ వుండడు. తప్పుచోటికి వొచ్చాననుకుంది. కృష్ణుడువొస్తే! యెవరంటే? యేం చెపుతుంది? పాదాలపైనబడి, కన్నీళ్ళతో తడిపి, తన జన్మ పావనమయిందని చెప్పి, తరవాత ఆయన ముఖకమల వంక చూసి....యింకా యేమిటా కోర్కె!- తరవాత ఒక్కసారి-

"నీకోసం యెవరో వొచ్చారురా."

"యెవర్రా ఆ వెధవ వెంకట్రాముడుకాదుకద! తనకీవలసిన పావలా కోసం చంపుకుతింటున్నాడు!"

"కాదురా యెవరో గోపిక!"

"పో!"

"నిజం. పోయి చూడు"

ఆ మాటలు వినబడ్డాయి. కాని రంగమ్మ చెవులు తెరుచుకునిలేవు.

వొస్తున్నాడు. చప్పున సిగ్గుపడి మొహం తిప్పేసి మూలకి వొదిగి వొణుకుతో చూస్తోంది. పితాంబరాలు విప్పి, గిరిజాల విగ్గు తీసేసి, రంగు మాత్రమే కడుక్కోక, యెర్రరంగు పెదిమల మధ్య బీడీ పెట్టి ప్రత్యక్షమైనాడు. నటరాజ మార్తాండతేజ బిరుదాంకితుడు, సోంపల్లి నారాయణరావు.

"యెవరు?.....యెందుకు....మాట్లాడవేం?"

యేమిటిది? యెవరతను? మెల్లిగా కల విచ్చిపోతోంది. సత్యం బోధపడుతోంది.

పలకరిస్తున్నాడు. మాట్లాడాలి. తీరావొచ్చి ఏం చెయ్యాలి? యేదో ఒకటి అనాలి తనెందుకొచ్చింది?

"మీరెంతో బాగా పాడారు"

యింకేమనాలి? తన నెగాదిగా చూస్తున్నాడు.

"యేపూరు? యెవరు నువ్వు?"

మాట్లాడలేదు. తనెందుకొచ్చినట్లిక్కడికి? "అలవై కుంఠ పురంబులో-పర్యంక రమావినోది; ఆపన్న ప్రసన్నుండు" ఇదా? ఇదేనా? ఇంకా లోపలికి వెళ్ళిచూస్తే! కాని యితనేనా కృష్ణుడు? కౌస్తుభాలంకారుడు! కమనీయగాత్రుడు, త్రైలోక్య సుందరుడు, రుక్మిణీలోలుడు, యితనా? మనసు ఆమెకలల కెదురు తిరిగింది.

"మిమ్మల్ని చూడాలని" అంది బలవంతం మీద.

"యిట్లా రా. కూచో"

వెళ్ళిపోవాలి. యెట్లా? వెళ్ళడమే వీలైతే!

"నేనింక వెడతాను"

"అప్పుడే!"

"కాచుకుని వున్నారు"

"యెవరు?....యెక్కడ,...వుండనీ,.యిప్పుడే వెడుదువు గాని"

లోపలి దీపపు వెలుతురు ప్రతిఫలించి-పక్కకి సిగ్గుతో వొంగిన నడుమూ, తనకు కనపడే ఆమెచంప ననుపూ, దానిమీద జీరలాడే జుట్టు భారమూ, అతనికళ్ళ నాకర్షించాయి. "రా" అని దగ్గిరికి వొచ్చాడు. వొస్తున్నాడు. ఎట్లా? యింకా వెనక్కి తగ్గింది. వెళ్ళిపోవాలి. బుజం మీద చేతులేసి లాగుతున్నాడు నవ్వుతో. అబ్బా? అసహ్యం. యిదేమిటి? యిదేం కృష్ణుడు? యిట్టా పట్టుకుంటాడేం? యేమిటా కక్కుర్తి?

"వుండండి. వినండి"

"నాకోసం వొచ్చావా? రా! వెడుదుగానిలే. తొందరేం?

"పొర పడుతున్నారు. నన్నువొదలండి."

ముక్కలు బ్రాందికంపుతో బద్దలవుతున్నాయి, దగ్గిరికి లాగాడు. ఆ చమట! చీదర! అసహ్యం! ఆ కోటు పాడుకంపు! యిదేమిటి? ఆ నోరు బీడీకంపు! ఆ వెకిలినవ్వు!

ఆ చీదర కళ్ళు, వొదులై లావెక్కి వేళ్ళాడే' వొళ్ళు. కఠినంగా పట్టుకుని, సార్వభౌముడి వలె తనని రెండు నిమిషాల్లో రంజింపజేయగల భర్త, పట్టెడకోసం చీకటిమూలల వెతికే భర్త జ్ఞాపకం వొచ్చాడు. చప్పున అతనిమీద దయవొచ్చింది. తను కనపడక, యేమయిందో అని, ఆ దయగల కళ్ళు, పట్టెడ పోయినా పల్లెత్తు కష్టమైనమాట మాట్లాడని ఔదార్యం, జ్ఞాపకమొచ్చాయి. వీడు చీకట్లోకి లాక్కెడుతున్నాడు.

"రెడ్డిగారూ! రెడ్డిగారూ?"

యెన్నడూలేనిది ఆ పేరెత్తి పిలిచింది.

కాళ్ళచప్పుడు;

"యేం లేదురా. మీరెవరూ రాకండి....."

"యెందుకొచ్చావు! నా కోసమేగా వొచ్చి ఈ బెట్టెందుకు? వినపడితే మాత్రం వొచ్చి యేం చేస్తాడు? నువ్వేగా నాకై వొచ్చింది?"

కాస్త ఆశా ఆరిపోయింది. అవును. ఆయనకేమని చెపుతుంది! విచారం, తిట్టు, వెలీ, వొద్దు, కాని వీడు-అయ్యో! అసహ్యం, పాపం! యెట్లా యిది వోర్చుకోడం! పెనుగులాడింది. తన్నింది కాని-

ఎన్నోసార్లు ఆ రంగస్థలంమీదనే ద్రౌపతి మానసంరక్ష చేసిన కృష్ణుడు, హరిశ్చంద్రుడి సత్యవ్రతం నిలపెట్టిన శ్రీమన్నారాయణుడు, ప్రహ్లాదుణ్ణాదరించిన నరసింహమూర్తి, అందరూ చెవులూ, కళ్ళూ మూసుకున్నారు. తననినమ్మి! తన ప్రతిరూప వేషధారి చేతికి చిక్కిన ఆర్తనాదం. ఆయనకి వినపళ్ళేదు ఏ లక్ష్మి మర్మభాషలకి చెవి వొగ్గాడో, యే తుంబురుడి గుర్రపుసంగీతం విని కళ్ళు మూశాడో, యే దేవేంద్రుడి స్వార్థస్తోత్రాలలో వుబ్బిపోతున్నాడో?

"అయ్యో! వొద్దు నమస్కారం పెడతాను. బుద్ధిలేనిదాన్ని, మూర్ఖురాల్ని, నన్ను వొదలండి, నమస్కారం పెడతాను, ఇందుకుకాదు నేను వొచ్చింది. అయ్యో! యెవరూ లేరా?"

"దిక్కుమాలిన మొరాలింపన్ ప్రపుణ్యాత్ముకుల్" లేనేలేరక్కడ. అక్కడ సైడ్‌కర్టన్‌మీది సరస్వతీ వాళ్ళప్పుడే పూజించిన పార్వతీదేవి విగ్రహం, రెప్పలన్నా వాల్చక, ఈ అన్యాయాన్ని నిబ్బరంగా చూస్తోనుంచున్నారు-రంగమ్మ నోచిన నోములు, కొలిచిన దేవతలు యెవరూ అడ్డం రాలేదు.

పల్లెటూరి రంగమ్మ శీలం బస్తీ నాగరికతా లక్ష్మికి బలి అయింది.

◆ ◆ ◆

*ప్రచురణ : (కర్మమిట్లాకాలింది కథల సంపుటి) స్టూడెంట్స్ బుక్ సెంటర్, **1968***